క్లుప్తంగా

మైనార్టీలకు చేసిందేమీలేదు



స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీల సంక్షేమానికి చేసిందేమీలేదని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్ అన్నారు. జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమం కేటాయింపులపై మాజీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని ఆరోపించారు. అసెంబ్లీ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఖురేషి, పట్టణ అధ్యక్షుడు గులాం జహీర్, నాయకులు షాబుద్దీన్, పీర్ సాధిక్, ఫహీం, బాష తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



కోయిల్‌కొండ: దేశవ్యాప్తంగా 16న చేపడుతున్న సమ్మెలో మండలంలోని కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వివిధ సంఘాల నాయకులతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు.

దేవరకద్ర: దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ఖలీల్, జిల్లా కార్యదర్శి యాదగిరి కోరారు. బుధవారం దేవరకద్రలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరపత్రాలను విడుదల చేశారు.

కెనరా బ్యాంకు ప్రారంభం



దేవరకద్ర: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డులో బుధవారం కెనరా బ్యాంకు నూతన శాఖను డీజీఎమ్ సునీల్‌కుమార్ ప్రారంభించారు. దేవరకద్ర ప్రజలకు కెనరా బ్యాంకు సేవలు అందించడానికి ఇక్కడ బ్రాంచిని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో డీఎమ్ శ్రీకాంత్, బ్రాంచి మేనేజర్ విజయ కుమార్, స్టాఫ్ సోని, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన వాహనాలతో కాలుష్యం

- కట్టడి చేయడంలో అధికారుల అలసత్వం

బాలానగర్: కాలం చెల్లిన భారీరీ వాహనాలు తీవ్ర వాయు కాలుష్యానికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా మండల పరిధిలోని పలు పరిశ్రమలకు వచ్చి పోయే పలు వాహనాలు తీవ్రస్థాయిలో కార్బన్‌డైఆక్సైడ్ వెదజల్లుతూ రోడ్లపై యథేచ్ఛగా తిరుగున్నాయి. వాటి నుంచి వెలువడుతున్న పొగతో ఇతరవాహనాలకు రోడ్డు సైతం కనిపించని పరిస్థితి తలెత్తుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కాలం చెల్లిన వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



వైభవంగా వసంత పంచమి



జిల్లాకేంద్రంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



జిల్లాకేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఏనుగొండ శ్రీరాంకాలనీలోగల శ్రీచక్రసహిత జ్ఞానసరస్వతి దేవీ ఆలయంలో భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, సహస్ర పుష్పార్చన పూజలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: వసంత పంచమి పురస్కరించుకుని మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వామినారాయణ్ గురుకులం అంతర్జాతీయ పాఠశాల, అయ్యప్పస్వామి ఆలయంలోని జ్ఞాన సరస్వతి, సరస్వతి శిశుమందిరం, వాసవీకన్యకాపరమేశ్వరి, సకలదేవతల ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు జరిపించారు. సరస్వతీ మాతకు పూజలు చేసి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

జేపీఎన్‌సీలో

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఘనంగా వసంత పంచమి కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు కళాశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి కళాశాల చైర్మన్ రవికుమార్ పూజలు చేశారు. ప్రిన్సిపాల్ సుజీవన్, చంద్రశేఖర్, వెంకటేష్, బదీరున్నిస, జమున రాధికలు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండలంలో బుధవారం ఘనంగా వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలల్లో సరస్వతి పూజలు నిర్వహించి సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. డోకూర్ తపోవన్ హైస్కూల్‌లో ఘనంగా పూజలు నిర్వహించారు.



డోకూర్‌లో..



జడ్చర్లలో అక్షరాభ్యాసం

నేటి నుంచి ఉత్సవాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం నుంచి వార్షిక ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 15న స్వామి వారికి అభిషేకం, అలంకారం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం కార్యక్రమాలు ఉంటాయని దేవస్థానం వారు తెలిపారు. 16న పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకారం నిర్వహిస్తారు. 17 తెల్లవారు జామున 5.30 గంటలకు స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.



దేవరకద్రలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి

లోక్‌సభ టికెట్ బీసీలకు ఇవ్వాలి



వాల్‌పోస్టర్లతో తహసీల్దార్ రాజు తదితరులు

భూత్పూర్: రాజకీయ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి బీసీలను ఉపయోగించుకొంటున్నారని.. వారికి ఎలాంటి న్యాయం చేయడం లేదని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ ఆరోపించారు. బుధవారం భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు, కృష్ణయాదవ్‌లతో పాటు 'అడిగితే వచ్చేది శూన్యం, పోరాడితేనే రాజ్యాధికారం' వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్‌ను అన్ని పార్టీలు బీసీలకు కెటాయించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, ఎల్కిచర్ల మాజీ సర్పంచ్ నాగయ్య, జి. నర్సింహులు, రాజు, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

గండేడ్: ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడికెళ్లినా బాధ్యతతో పనిచేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్లిన డీటీ ఇంతియాజ్, ఆర్ఐ రాఘవేందర్, సర్వేయర్ ఆనందర్, ఆపరేటర్ లాలయ్యలకు బుధవారం వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా వారికి శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ నాగలక్ష్మి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న నాయకులు

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి



కులాంతర వివాహం చేసుకున్న దంపతులను సన్మానించిన కేవీపీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: కులాంతర వివాహం చేసుకున్న వారిని ప్రోత్సహించేలా కేవీపీఎస్ ఆధ్వర్యంలో అభినందన సభ బుధవారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యం రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడ లేని కుల వ్యవస్థ భారతదేశంలో ఉందని అన్నారు. దేశంలో కుల నిర్మూలన జరగాలని జ్యోతిబాపులే, అంబేడ్కర్ తదితరులు త్యాగాలు చేశారని గుర్తుచేశారు. కులాంతర, మతాంతర వివాహాలను ఆదర్శవంతమైనవిగా గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కులాంతర వివాహాల ప్రత్యేకమైన రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న 20 జంటలు 2022, 2023లో ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం కోసం దరఖాస్తు చేసుకున్నారని, కానీ నేటికీ వారికి ఆర్థిక సహాయం అందలేదని అన్నారు. గృహజ్యోతి కింద ఒక ఇల్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 10 లక్షలు, ఉద్యోగ నియామకాల్లో 2 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు పూలదండలు వేసి, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ పట్టణ అధ్యక్షుడు ఆది విష్ణువర్ధన్, సీఐటీయూ నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మండలంలోని గుడిబండ స్టేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గుడిబండకు చెందిన ఆటోలో రాములు, కావలి వెంకటమ్మలు అడ్డాకులకు వెళ్తున్నారు. గుడిబండ స్టేజీ వద్ద ఆటో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. ఆటో పక్కనే ఉన్న ద్విచక్రవాహనాన్ని కూడా తగిలింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను ఠాణాకు తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఎం.శ్రీనివాసులు తెలిపారు.

సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 15న నిర్వహించే కార్యక్రమాల్లో జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి గిరిజనులు, అన్ని కులాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులు, సిబ్బంది మహాభోగ్ కార్యక్రమం, ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

సెలవు ప్రకటనపై హర్షం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సేవాలాల్ జయంతి సందర్భంగా బంజార ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేక సెలవు నిర్ణయంపై.. సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రనాయక్, కన్వీనర్‌లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి దేవిజానాయక్‌లు గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జీఓ నెంబర్ 252ను విడుదల చేయడం శుభపరిణామని అన్నారు.

క్షేత్రపర్యటనలో ఎంవీఎస్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల బీకాం, బీబీఏ విద్యార్థులు పోతులమడుగు వద్ద ఉన్న ఎంఎస్ఆర్ కాటన్స్, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై దిగాల్సిందేనా?

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని బస్టాండ్‌కు ఆర్టీసీ ఆర్డీనరి బస్సులు రావడం లేదు. కొన్నాళ్ల నుంచి గద్వాల డిపోకు చెందిన ఆర్డీనరి బస్సులో వచ్చే ప్రయాణికులను 44వ నంబర్ రహదారిపైనే దింపేస్తున్నారు. కేవలం మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డీనరి బస్సులు మాత్రమే బస్టాండ్‌కు వస్తున్నాయి. గద్వాల డిపోకు చెందిన ఆర్డీనరి బస్సులో ఎక్కే ప్రయాణికులకు మూసాపేట టికెట్ ఇచ్చినా వారిని హైవేపైనే దింపుతున్నారు. దీంతోవారు రహదారి నుంచి బస్టాండ్ వరకు నడిచి వెళ్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్సు ఎక్కేటప్పుడే గ్రామంలోకి వెళ్లదని చెబితే మరో బస్సులో వెళ్తామని, టికెట్ కొని బస్సు దిగేటప్పుడు రహదారిపైనే దింపడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కొన్నిసార్లు మొండికేసి దిగకుంటే కొన్ని బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి వెళ్తున్నాయి. చాలా రోజుల నుంచి ఇలాగే జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రారంభమైన ఆలయ వార్షికోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం శ్రీనివాసకాలనీలోగల శ్రీపంచముఖి ఆంజనేయస్వామి ఆలయం 20వ వార్షికోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజ, రక్షాబంధన, అఖండ దీపస్థాపన, ధ్వజారోహణం, కలశస్థాపన మంటపారాధన పూజలు, సాయంత్రం దీక్షాహోమం, గణపతిహోమం, పాశుపత నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ప్రాతః కాలపూజ, దీక్షాహోమం, శ్రీవిశాలక్షి, విశ్వేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన, రుద్రహోమం, మహోమంగళహారతి పూజలు నిర్వహిస్తారు. పూజల్లో దేవాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి పదవులివ్వాలి

జడ్చర్ల: తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జడ్చర్లకు చెందిన నయూమ్‌ను మైనార్టీ సెల్ అసెంబ్లీ కోర్డినేటర్‌గా నియమించడం తగదని నాయకులు ఖయ్యూం తదితరులు నిరసన తెలిపారు. బుధవారం స్థానికంగా సన్మాన కార్యక్రమాన్ని వారు బహిష్కరించినట్లు తెలిపారు. మైనార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు పదవులు ఇవ్వాలని, ఇష్టానుసారంగా చేస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేకత వస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఫయాజ్ తమ మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో కష్టపడిన వారికి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిర్లక్ష్యం విడనాడాలి

నారాయణపేట రూరల్: రైతులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని కొటకొండలో బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్తున్న రైతులపై అనుచితంగా వ్యవహరించడం సరికాదని, నిర్బంధ ఆంక్షలు విధించడం, 144సెక్షన్ అమలు చేయడం, కాల్పులు జరపడం ప్రయోగం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. కార్యక్రమంలో నర్సింహ, జయలక్ష్మి, యాదగిరి, రాములు, హన్మంతు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



కోయిల్‌కొండ ఎంపీడీఓ కాళప్పను సన్మానిస్తున్న అధికారులు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలువురు అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని డీఎల్‌పీఓ పండరీనాథ్ అన్నారు. గురువారం బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు శాలువాతో ఆయనను సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, ప్రధానకార్యదర్శి వెంకట్‌స్వామి, ఉపాధ్యక్షుడు జంగీర్, కోశాధికారి నాగరాజు, రాంచందర్ పాల్గొన్నారు.

ఉమ్మడి గండేడ్ ఎంపీడీఓగా కే దేవన్న చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు. ఎంపీఓ శంకర్‌నాయక్, సూపరిండెంట్ ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సత్యయ్య, శ్రీలత తదితరులు ఉన్నారు. జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.రాజయ్య, భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా బి. సురేందర్‌రెడ్డి, బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఎంపీఓ విజయకుమార్ అడ్డాకులకు బదిలీ కాగా, అడ్డాకుల ఎంపీడీఓ శ్రీదేవి భూత్పూర్ ఎంపీఓగా బదిలీ అయినట్లు తెలిసింది. అడ్డాకుల ఎంపీడీఓగా బి.శ్రీనివాస్, మూసాపేట ఎంపీడీఓగా కృష్ణయ్య, భూత్పూర్ ఎంపీడీఓగా కె. ప్రభాకర్, చిన్నచింతకుంట ఎంపీడీఓగా సుధాకర్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. బాలానగర్ ఎంపీడీఓగా శరత్‌చంద్ర బాబు, కోయిల్‌కొండ ఎంపీడీఓగా కాలప్ప, హన్వాడ ఎంపీడీఓగా యశోద, మహమ్మదాబాద్ ఎస్ఐగా శేఖర్‌రెడ్డి, బుధవారం చార్జ్ తీసుకున్నారు.



భూత్పూర్ ఎంపీడీఓ ప్రభాకర్‌కు సన్మానం

అమర జవాన్లకు ఘననివాళి



రాజాపూర్‌లో తిరంగా ర్యాలీ



నవాబుపేటలో ..

రాజాపూర్: పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో వీరమరణం పొందిన అమర జవాన్లకు బుధవారం రాజాపూర్ మండల కేంద్రంలో ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆర్మీ రిటైర్డ్ జవాన్ గీత్‌రెడ్డి ఆధ్వర్యంలో 150 మీటర్ల తిరంగా జెండాతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అమరులైన జవాన్ల కోసం రెండునిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఆనంద్, నర్సింలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: పుల్వామ ఉగ్రదాడిలో అమరులైన వీరజవాన్లకు మండల కేంద్రంలో బుధవారం రాత్రి నివాళి అర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలోనూ జవాన్లకు నివాళి అర్పించారు. ఫోరం నాయకులు నర్సింహులు, అనంతయ్య, భర్మణి విజయ్‌కుమార్, చౌదరి వెంకటేశ్వరప్ప, వేణునాథం, వివిధ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వివాహం ఇష్టం లేక..

- ఇంట్లోంచి వెళ్లిపోయిన యువకుడు

దేవరకద్ర: నాగారం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యం అయిన ఘటనపై పోలీసులు బుధవారం కేసునమోదు చేశారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటేష్ (22) ఈ నెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం అతడి అన్న ఎరుకలి భీమన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదిహేను రోజుల క్రితం తమ అక్క కుమార్తెతో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నామని... వివాహం ఇష్టంలేకనే వెంకటేష్ ఇంటి నుంచి వెళ్లి పోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

యువతి అదృశ్యం : కేసునమోదు

జడ్చర్ల: ఓ యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. గోప్లాపూర్‌కి చెందిన సంతోష(20) మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. కాగా విషయంపై ఆమె తండ్రి రాములు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇంట్లో తామందరితో కలిసి నిద్రకు ఉపక్రమించిన తమ కుమార్తె తెల్లారేసరికి కనిపించకుండా పోయిందని వివరించారు. ఆమె మొబైల్ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.